ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 16 సెప్టెంబరు 2024



వాల్మీకిపురం నుంచి మదనపల్లెకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు

- మదనపల్లె ప్రజలకు అందని ద్రాక్షలా ఇసుక
- రాజంపేట రీచ్ నుంచి మదనపల్లెకు 140 కి.మీ.
- గత ప్రభుత్వంలో 35 కి.మీ.కే టిప్పర్ ధర రూ.22 వేలు
- ప్రస్తుతం 21 టన్నుల టిప్పర్ ఇసుక ధర రూ.24 వేలు
- ఇక్కడే రీచ్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

ఇసుక.. బహు దూరం..



మహల్ వద్ద గుర్తించిన రీచ్‌ల వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టినా మదనపల్లె ప్రాంత ప్రజలకు ఉచిత ఇసుక చేరే సంగతి దేవుడెరుగు. చిన్న పిల్లలు ఉప్పు మూట ఆట ఆడుకునేటప్పుడు బరువు మోయలేక చెప్పుకునే 'ఎంతెంత దూరం..చానా చానా దూరం' అనే మాటలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వం రాజంపేట మండలం బాలరాచపల్లె, సానిపాయి ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించి, అక్కడి నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఉచిత ఇసుక సరఫరా ప్రారంభించింది. కానీ ఈ రీచ్‌లు మదనపల్లె ప్రజలకు చాలా దూరం అంటే 140 కిలోమీటర్ల వరకు ఉండటంతో ఉచిత ఇసుక అటుంచి, అంతదూరం రవాణా చార్జీలు ఎక్కువైపోతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో మదనపల్లెకు కేవలం 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడికుర్తి నుంచి ఇసుక మదనపల్లెకు చేరాలంటే 21 టన్నుల టిప్పర్ రూ.22 వేలకు దొరుకుతుండేది. ఇప్పుడు రాజంపేట నుంచి మదనపల్లెకు 140 కిలోమీటర్ల దూరానికి 21 టన్నుల ఇసుక రూ.22 నుంచి రూ.24 వేల వరకు ధర పడుతోంది. దీంతో మదనపల్లె ప్రజలకు ఉచిత ఇసుక అందని ద్రాక్షలా మారుతోంది. మదనపల్లెకు దగ్గరలోనే ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని, దీంతో రవాణా చార్జీలు తగ్గి తక్కువ ధరకే ఇసుక దొరుకుతుందని స్థానిక ప్రజలు, బిల్డర్లు కోరుతున్నారు.

కొత్త రీచ్‌లతో పెరిగిన దూరాభారం

రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండలంలోని బాలరాచపల్లె, సానిపాయి ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించింది. ఇక్కడ నుంచే జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ఉచిత ఇసుక తరలించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుంచి ట్రాక్టర్‌కు 0-10 కిలోమీటర్ల దూరానికి రవాణా చార్జీలను రూ.547, 10 టన్నుల టిప్పర్‌కు రూ.972, 20 టన్నుల టిప్పర్‌కు రూ.1532 రవాణా చార్జీలను నిర్ణయించారు. అలాగే దూరం పెరిగే కొద్దీ 81-90 కిలోమీటర్లకు 20 టన్నుల టిప్పర్‌కు రూ.11,487 రవాణా చార్జీలు నిర్ణయిస్తూ ప్రతిపాదనలు ఇచ్చారు. రాజంపేట మండలంలోని రీచ్‌ల నుంచి మదనపల్లెకు రెండు మార్గాలు ఉండగా ఎటు వెళ్లినా కనీసమంటే 140 కిలోమీటర్ల దూరం వస్తోంది. దీంతో ఇసుక రవాణా చార్జీలు టిప్పర్‌కు రూ.17,800 పడుతోంది. దీనికి తోడు 20 టన్నుల టిప్పర్‌కు రీచ్‌లో టన్నుకు రూ.340 చలానా పెట్టుకున్నా, 20 టన్నులకు రూ.6800 చెల్లించాలి. రవాణా చార్జీలు, చలానా కలిపి 20 టన్నుల ఇసుక టిప్పర్ మదనపల్లెకు చేరాలంటే రూ.24,600 నుంచి రూ.28 వేల ధర పడుతోంది. దీనిని బట్టి చూస్తే గతంలో మదనపల్లెకు 20 టన్నుల ఇసుక రూ.21 వేలకే దొరుకుతుండగా, ఇప్పుడు రూ.24,600 పైగా ధర పడుతోంది. ఈ క్రమంలో మదనపల్లె ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ అందని ద్రాక్షలాగా మారిపోయింది.



నిమ్మనపల్లె మండలం అగ్రహారం వద్ద.. కలికిరి మండలం మహల్ వద్ద బాహుదానదిలో ఇసుక మేటలు

ఇసుక రీచ్‌లు గుర్తించని అధికారులు

మదనపల్లె మండలం నుంచి నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కలికిరి, కలకడ మీదుగా ప్రవహించే బాహుదా నదిలో పలుచోట్ల ఇసుక రీచ్‌లు ఉన్నాయి. గతంలో కలికిరి మండలంలోని చీకటిపల్లె, గుండ్లూరు, మహల్, పారపట్ల, అద్దెవారిపల్లె, పల్లవోలు ప్రాంతాల్లో ఆరు రీచ్‌లు ఉండేవి. ప్రభుత్వం మారిపోయాక ప్రస్తుత అధికారులు అక్కడ రీచ్‌లను గుర్తించలేదు. అలాగే నిమ్మనపల్లె మండలంలో అగ్రహారం, రెడ్డివారిపల్లె ప్రాంతాల్లో కూడా బాహుదా నదిలో ఇసుక మేటలు ఉన్నాయి. వాల్మీకిపురం మండలంలో చింతపర్తి, మాధవరంపల్లె ప్రాంతాల్లో కూడా బాహుదా నదిలో ఇసుక మేటలు ఉన్నాయి. గతంలో కలికిరి మండలంలోని ఆరు ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మదనపల్లెకు ఇసుక తరలించేవారు. అప్పుడు ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానాతో పాటు, రవాణా చార్జీలు కలిపి టన్ను ఇసుక మదనపల్లె చేరాలంటే రూ.1000 ధర పలికేది. టిప్పర్‌కు రూ.21 వేల నుంచి రూ.24 వేలు, ట్రాక్టర్ (నాలుగున్నర టన్ను) ఇసుక రూ.4500 నుంచి రూ.5000 ధర పడేది. ఇప్పుడు జిల్లా అధికారులు బాహుదా నదిలో ఇసుక రీచ్‌లను గుర్తించకపోవడంతో పాటు జిల్లా అంతటికీ రాజంపేట మండలంలోని మూడు రీచ్‌లనే గుర్తించడంతో మదనపల్లె ప్రజలకు ఇబ్బందులు వచ్చి పడ్డాయి.

ఇసుక అక్రమ రవాణాకు పెరిగిన అవకాశాలు

ప్రభుత్వం రాజంపేట మండలంలోని మూడు రీచ్‌ల నుంచి మాత్రమే ఉచిత ఇసుక రవాణా చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మదనపల్లెకు టిప్పర్లతో ఇసుక తరలిస్తే టన్ను రూ.1238 వరకు ధర పడుతోంది. దీంతో చాలామంది ఇళ్లు, భవనాలు నిర్మాణం చేసే కాంట్రాక్టర్లు ట్రాక్టర్ల మీదే ఆధారపడుతున్నారు. మదనపల్లె, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, కలికిరి మండలాల నుంచి అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్లకు ఇది మంచి అవకాశంగా మారింది. ఈ మండలాల్లో వాగులు, వంకలు, చెరువులతో పాటు ప్రధానంగా బాహుదా నదిలోని ఇసుక మేటలపై కన్ను పడిన ట్రాక్టర్ యజమానులు ఇసుకను పడి దోచుకు తింటున్నారు. మదనపల్లె ప్రజల ఇసుక అవసరాలను గుర్తించిన అధికారులు కూడా అడపాదడపా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసులు పెట్టి వదిలేస్తున్నారు.

బాహుదా నదిపై ఇసుక రీచ్‌లను గుర్తించాలి

మదనపల్లె ప్రాంత ప్రజలకు ఉచిత ఇసుక పాలసీలో తక్కువ ధరలకే ఇసుక అందాలంటే బాహుదా నదిపై ఇసుక రీచ్‌లను గుర్తించాల్సిన అవసరం ఉంది. మదనపల్లె మండలంలో ప్రారంభమయ్యే బాహుదానది, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కలికిరి మండలాల మీదుగా సుమారు 65 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తోంది. ఈ నది వెడల్పు ఉన్న ప్రాంతాల్లో ఇసుక మేటలు భారీగా ఉన్నాయి. ఇక్కడ అధికారులు పర్యటించి ఎంత మేరకు ఇసుక అందుబాటులో ఉందో పరిశీలిస్తే, ఎక్కడ ప్రభుత్వ ఇసుక రీచ్‌లు ఉన్నాయో గుర్తించవచ్చు. ఇక్కడి నుంచే మదనపల్లె ప్రాంతానికి ఇసుక తరలిస్తే రవాణా చార్జీలు గణనీయంగా తగ్గిపోయి, ప్రభుత్వం ఆశించినట్లు ప్రజలకు తక్కువ ధరకే ఇసుక సరఫరా చేసే అవకాశం ఉంది. దీనిపై సంబంధిత అధికారులు కార్యాచరణ రూపొందించాల్సిన ఆవశ్యకత ఉంది.

యూనిట్ ధరలు తగ్గడం లేదు..



మదనపల్లెలో భవన నిర్మాణాల్లో కాంట్రాక్టర్లపై యజమానులు యూనిట్ నిర్మాణ ధరలు తగ్గించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఉచిత ఇసుక విధానం వచ్చింది కదా ఎందుకు ధరలు తగ్గించలేదని ప్రశ్నిస్తున్నారు. బాహుదా నదిపై ఇసుక రీచ్‌లు లేకపోవడంతో రాజంపేట ఇసుక టిప్పర్ రూ.28 వేలు పడుతోంది. నిర్మాణ ఖర్చులు పెరిగాయే కానీ తగ్గలేదు. దీనిపై అధికారులు ఆలోచించాలి. బాహుదా నదిపై పూర్వపు రీచ్‌లు ఏర్పాటు చేయాలి.

- అరుణ్‌తేజ, అరుణ్ బిల్డర్స్, మదనపల్లె



ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

హరిహరా.. ఎంత దోపిడీ..?

- చెరువులను చెరబట్టారు..
- ఇసుక వేటలో చెరువులు, కుంటలు ధ్వంసం
- పట్టించుకోని అధికారులు
- 2 వేల ట్రాక్టర్ల ఇసుక తరలింపు

గుర్రంకొండ, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఇసుక అక్రమ రవాణా మాత్రం విచ్చలవిడిగా సాగుతోంది. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం పలు ఆంక్షలు విధించినా ఈ ఆంక్షలు తమకు పట్టవంటూ ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని హరిహరాదుల చెరువు నుంచి ఇసుకను తరలించి ఆ చెరువు స్వరూపాన్నే మార్చేశారు. ఇసుక వేటలో నాయకులు, ఇసుకాసురులు చెరువులు, కుంటలు, వాగులను ధ్వంసం చేస్తున్నారు. ఇసుక తవ్వకాల కోసం చెరువులో ఎక్స్‌కవేటర్లను ఉంచి రాత్రింబవళ్లు తోడేస్తున్నారు. ఇసుకాసురుల అక్రమాలకు చెరువులు తమ రూపురేఖలను కోల్పోతున్నాయి. పగటి పూట ఇసుకను ఓ చోట డంప్ చేసి చీకటి పడగానే టిప్పర్లలో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుకను వేలాది రూపాయలకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలను గడిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారి తీస్తోంది.

గుర్రంకొండ మండలంలో 15 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీలలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. ఈ క్రమంలో నాయకులు, ఇసుకాసురులు ఇసుక కోసం చెరువులు, కుంటలు, వాగులపై పడి పీల్చి పిప్పి చేస్తున్నారు. వీరి అక్రమాలకు చెరువులు, కుంటలు రూపురేఖలను కోల్పోతున్నాయి. మండలంలో ఐదు ఇరిగేషన్ చెరువులున్నాయి. మర్రిపాడు పంచాయతీ పరిధిలోని హరిహరాదులచెరువు, తరిగొండ పంచాయతీ పరిధిలో రామానాయునిచెరువు కూడా ఇరిగేషన్ చెరువులే. ఈ చెరువులలో ఇసుక అధికంగా ఉంది. దీంతో ఇసుకాసురులు, నాయకుల కన్ను చెరువులపై పడిందో లేదో...వెంటనే ఇసుక తవ్వకాలను చేపట్టారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లను చెరువులో ఉంచి ఇసుకను తోడేస్తున్నారు. ఇలా ఇసుకను పగలంతా ఓ చోట డంప్ చేసి చీకటి పడగానే రాత్రి పూట బయటి ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలను గడిస్తున్నారు. ఈ రెండు చెరువుల్లో సుమారు 2 వేల ట్రాక్టర్ల ఇసుకను తరలించి ఉంటారని ఆయకట్టు రైతులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో రైతులు, ప్రజలు అక్రమ ఇసుక రవాణాపై నోరు మెదపలేకపోతున్నారు.

ఇసుక కోసం గొడవ

మండలంలోని మర్రిపాడు హరిహరాదులచెరువులో ఇసుక కోసం కొందరు ఇసుకాసురులు గొడవ పడ్డారు. ఈ చెరువులో వాల్మీకిపురం మండలానికి చెందిన కొందరు ఇసుకాసురులు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో మండలానికి చెందిన కొందరు ఇసుకాసురుల మధ్య ఇసుక విషయమై వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో బయట మండలాల వ్యక్తులకు, స్థానికులకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో నాయకులు కల్పించుకుని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగినట్లు తెలిసింది. దీంతో ఇసుకాసురులు ఇసుక తవ్వకాలను ఇష్టానుసారంగా చేసి పోటాపోటీగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకొంటున్నారు.



హరిహరాదుల చెరువులో ఎక్స్‌కవేటర్‌తో తవ్విన ఇసుక గుంతలు

ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

మండలంలోని మర్రిపాడు హరిహరాదులచెరువులో ఇసుకను లోడ్ చేసుకుని అక్రమంగా మదనపల్లెకు ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు గత నెల చివరలో సీజ్ చేశారు. ఈ ఇసుక టిప్పర్‌ను పోలీసుల నుంచి విడిపించడానికి నాయకులు విశ్వప్రయత్నాలు చేశారు. విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో కేసు నమోదు చేసి సీజ్ చేశారు. అధికారులకు సమాచారం రావడంతో వెళ్లి కొన్ని వాహనాలను మాత్రమే పట్టుకొంటున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం..

మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకొని సీజ్ చేస్తున్నాం. అలాగే మండలంలోని హరిహరాదులచెరువులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిని హెచ్చరించాం. అధికారులు ఆదేశాలను పాటించకుంటే వారిపై చర్యలు తీసుకొంటాం. అక్రమ ఇసుక రవాణాను రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి కట్టడి చేస్తాం.

- మధురామచంద్రుడు, ఎస్‌ఐ, గుర్రంకొండ



చుండువారిపల్లె వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ

జగనన్న కాలనీల్లో..

అవినీతి చీడ

- డబ్బులు తీసుకుని పట్టాలిచ్చారు...
- వైసీపీ నాయకుల చేతిలో 100కు పైగా డీఫారాలు
- ఉన్నతాధికారులకు టీడీపీ నాయకుల ఫిర్యాదు



రాజంపేట మండలం ఊటుకూరులోని జగనన్న కాలనీ

రాజంపేట, సెప్టెంబరు 15: రాజంపేట మండలంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో భారీ ఎత్తున అవినీతి జరిగింది. కొందరు వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులను లోబరచుకుని 100కు పైగా ఇంటి పట్టాలకు డీఫారాలు సృష్టించుకున్నారని తెలుస్తోంది. ఓ రెవెన్యూ అధికారి భారీగా ముడుపులు తీసుకుని అనర్హులకు డీఫారాలు ఇచ్చారని దీనిపై టీడీపీ నాయకులు కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం ప్రస్తుతం రాజంపేటలో హాట్‌టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే... రాజంపేట మండలంలోని 16 చోట్ల గత ప్రభుత్వం భారీ ఎత్తున జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. అయితే రాజంపేట పట్టణానికి అతి సమీపంలో విలువైన ప్రాంతంలో 4 చోట్ల జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. అందులో ఊటుకూరు, చుండువారిపల్లె, బ్రాహ్మణపల్లె, పోలి ప్రాంతాల్లో ఒక్కో కాలనీలో వెయ్యి నుంచి మూడు వేల వరకు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ ఇంటి నిర్మాణాలు చేసే సమయంలో విలువైన ఈ ప్రాంతంలో దారిద్ర్య రేఖకు దిగువనున్న పేదలు తమకు ఇళ్లు కేటాయించినా ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో ఇళ్లు కట్టకుండా వదిలేశారు. దీంతో ఈ కాలనీల్లో పెద్దఎత్తున ఖాళీ ఇంటి జాగాలు ఏర్పడ్డాయి. ఖాళీ ఇంటి జాగాలకు పెద్ద డిమాండ్ ఉండడంతో ఎన్నికలకు ముందు పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి గుట్టుచప్పుడు కాకుండా ఈ ఖాళీ ఇంటి స్థలాలకు పెద్దఎత్తున ముడుపులు తీసుకుని కొందరికి డీఫారాలు ఇచ్చినట్లు తెలిసింది. కొందరు వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులను లోబర్చుకుని ఒక్కో పట్టాకు పెద్దఎత్తున ముడుపులు ఇచ్చి ఖాళీగా ఉన్న స్థలాలన్నింటిని డీఫారాల రూపేణా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని గుట్టుచప్పుడు కాకుండా ఇతరులకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. చుండువారిపల్లె, బ్రాహ్మణపల్లె, ఊటుకూరు ప్రాంతాల్లో ఈ వ్యవహారం పెద్దఎత్తున జరిగినట్లు తెలుస్తోంది. మామూలుగా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో రిజిస్టర్ భూములకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. సెంటు స్థలం 5 లక్షల రూపాయలు పలుకుతుంది. ఇదే ప్రాంతంలో గుట్టలను చదును చేసి వాటికి మౌలిక సదుపాయాలు కల్పించి జగనన్న కాలనీల పేరిట ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో ఈ స్థలాలకు పెద్దగా డిమాండ్ ఏర్పడింది. ఇంటి స్థలాలను ఇళ్లు కట్టుకున్న వారికే కేటాయించాలి. గృహ నిర్మాణ శాఖ పక్కా గృహాలను మంజూరు చేస్తేనే ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు స్థలాలు కేటాయించాలి. ఆ విధంగా కాకుండా కొంతమంది వైసీపీ నాయకుల అవినీతి సొమ్ముకు తలొగ్గి ఒక్కొక్కరికి ఎక్కువ మొత్తంలో ఈ స్థలాలకు సంబంధించిన అనుభవ సర్టిఫికెట్లు, డీఫారాలు జారీ చేసినట్లు తెలిసింది. ఒక్కో డీఫారానికి 20 వేల నుంచి 30 వేల వరకు తీసుకుని సుమారు 100కు పైబడి స్థలాలను ఈ విధంగా తప్పుడు అనుభవ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కలెక్టర్, సబ్‌కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం భగ్గుమంది. దీంతో ఈ జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతి డీఫారాల వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారింది. ఈ విషయమై రాజంపేట తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌ను వివరణ కోరగా ఈ విషయంపై విచారణ చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బ్రాహ్మణపల్లె వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఖాళీగా ఉన్న స్థలాలు

హార్సిలీహిల్స్‌లో హైకోర్టు జడ్జి



బి.కొత్తకోట, సెప్టెంబరు 15: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు రాష్ట్ర హైకోర్టు జడ్జి మన్మధరావు విచ్చేశారు. కుటుంబ సమేతంగా హిల్స్‌కు వచ్చిన జడ్జికి ఆదివారం మండల డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అన్సారీ మర్యాదపూర్వకంగా పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అధికారులు జడ్జి కుటుంబీకులకు స్థానిక గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాట్లు చేశారు. ఇన్‌చార్జ్ సీఐ రాజారమేష్ ప్రోటోకాల్ మేరకు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. వ్యక్తిగతంగా ప్రైవేటు పర్యటనకు వచ్చిన జడ్జి రెండు రోజుల పాటు హార్సిలీహిల్స్‌లో విడిది చేసి, హిల్స్ అందాలను, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించనున్నారు. స్థానిక ఆర్‌ఐ బాలాజీ, వీఆర్వో నరేంద్రకుమార్, హెడ్ కానిస్టేబుల్ బొజ్జేనాయక్‌లు పాల్గొన్నారు.

పర్యాటకులతో కిటకిటలాడిన కొండ

బి.కొత్తకోట, సెప్టెంబరు 15: హార్సిలీహిల్స్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఆదివారంతో పాటు సోమవారం కూడా సెలవు కావడంతో దూరప్రాంతాల నుంచి పలువురు తమ కుటుంబాలతో హిల్స్‌కు చేరుకున్నారు. బెంగళూరు నుంచి వారాంతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కొండ కిటకిటలాడింది. హిల్స్‌పై ఉన్న గాలిబండ, పాత, కొత్త ఏరియల్ వ్యూపాయింట్లు, మానససరోవరంలో బోటింగ్, సాహసక్రీడల ప్రాంగణం తదితర ప్రాంతాలలో యాత్రికులు కలియతిరుగుతూ ఉత్సాహంగా గడిపారు. ఏపీ టూరిజం రెస్టారెంట్ సైతం సందడిగా కనిపించింది.

వైభవంగా గణేశ్ నిమజ్జనం

- ఆకట్టుకున్న కోలాటాలు, చెక్కభజనలు
- భారీ ఎత్తున బాణాసంచా పేలుళ్లు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 15: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 9వ రోజు జిల్లాలోని పలుచోట్ల గణేశ్ నిమజ్జనం వైభవంగా జరిగింది. 9రోజుల పాటు పూజలందుకున్న గణపయ్యను బ్యాండు మేళాలు, బాణా సంచాల మధ్య పురవీధుల్లో కోలాటాలు, చెక్కభజనలు, డీజే సాంగ్స్‌తో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా చేశారు. ఊరేగింపు సందర్భంగా పెద్ద ఎత్తున యువత రంగు పొడులు చెల్లుకుంటూ జైబోలో గణేశ్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ వినాయకుడి పట్ల తమకున్న భక్తిభావాన్ని చాటుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



చిన్నమండెం బస్టాండు కూడలి వద్ద నిమజ్జన కోలాహలం

ఇద్దరు ఎంఈవోల

విధానానికి స్వస్తి?

- స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15: మండలానికి ఇద్దరు ఎంఈవోల విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్లు సమాచారం. గతంలో మాదిరిగా ఎంఈవో ఒక్కరే ఉంటారు. అయితే పాఠశాలల్లో విద్యాబోధనను పర్యవేక్షించడానికి స్కూలుకాంప్లెక్స్ వ్యవస్థను పటిష్టం చేసి అక్కడ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. విద్యాబోధన, టీచర్ల సర్వీసు వ్యవహారాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు పర్యవేక్షించేవారు. అయితే ఎంఈవోలకు పనిభారం ఎక్కువగా ఉందని భావించిన గత వైసీపీ ప్రభుత్వం ప్రతి మండలానికి రెండో ఎంఈవో పోస్టును కేటాయించారు. ఎంఈవో-1గా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు ఎంఈవో 2గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో సీనియర్లకు అవకాశం కల్పించారు. మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కంటే ఇరువురు ఎంఈవోల మధ్య ఆధిపత్య పోరే ఎక్కువగా ఉండేది. ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు వ్యవహారంలో ఎంఈవోల మధ్య యుద్ధం కొనసాగుతుండేది. చివరికి కొత మంది సహకారంతో ప్రైవేటు పాఠశాలలను ఇద్దరు చెరో సగం పంచుకుని పాలన చేస్తుండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండడంతో కొత్త ప్రభుత్వం మండలానికి ఒకరిని మాత్రమే ఉంచాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం కూడా వచ్చినట్లు సమాచారం. ఒక ఎంఈవోనే కొనసాగిస్తే పాఠశాలపై పర్యవేక్షణ బాధ్యత స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నారు. కడప జిల్లాలో 236 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 181 స్కూ లు కాంప్లెక్స్‌లున్నాయి. తాజా నిర్ణయంతో స్కూలు కాంప్లెక్స్‌ల సంఖ్య స్వల్పంగా తగ్గుతుందని తెలుస్తుంది. మారుమూల ప్రాంతాల్లో ఉన్న స్కూలు కాంప్లెక్స్‌ల బాధ్యత అందుబాటులో ఉన్నత పాఠశాలలకు అప్పగించనున్నారు.

ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు..

ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు. అయితే ఎంఈవోల సీనియారిటీ డేటా అడిగారు. ఉప విద్యాధికారులుగా ఎంత మంది విల్లింగ్ ఉన్నారన్న సమాచారం కూడా అధికారులు అడిగారు. ఈ సమాచారం కూడా పంపించడం జరిగింది.

- డీఈవో అనురాధ, కడప జిల్లా

కంప్యూటర్ ఆపరేటర్ మరో రూ.3 లక్షలు స్వాహా

చాపాడు, సెప్టెంబరు 15: ఎంపీడీఓ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ హానిక్‌బాష మరో రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రూ.3.3 లక్షలు స్వాహా చేసినట్లు అధికారులు తెలిపారు. వెదురూరు పంచాయతీ నుంచి రూ.2.78 లక్షలు, పల్లవోలు నుంచి రూ.25 వేలు, ఇతర బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే భద్రిపల్లె పంచాయతీ నుంచి రూ.2.54 లక్షలు స్వాహా చేశారు. 2024 జనవరి నుంచి విడతల వారీ డబ్బు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు. మూడు పంచాయతీలకు సంబంధించి మొత్తం రూ.5.57 లక్షలు స్వాహా చేశారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు గోల్‌మాల్ జరిగినా అప్పటి ఎంపీడీఓ రంతులయ్యాగానీ, ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి గానీ పట్టించుకోలేదు. హానిక్‌బాష సౌదీ అరేబియా దేశానికి వెళ్లేందుకు పాస్‌పోర్టుకోసం దరఖాస్తు చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడును వివరణ కోరగా హానిక్‌బాష వెదురూరు, పల్లవోలు పంచాయతీల నుంచి రూ.3.3 లక్షలు స్వాహా చేసిన విషయం నిజమేనన్నారు. పల్లవోలుకు సంబంధించి రూ.25 వేలు రికవరీ చేశామన్నారు. ఇతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మైలవరానికి 7,500 క్యూసెక్కుల విడుదల

కొండాపురం, సెప్టెంబరు 15: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి నీటి విడుదలను ఆదివారం 5000 నుంచి 7,500 క్యూసెక్కులకు పెంచినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతున్నట్లు డీఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఆయన తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల



మైలవరం, సెప్టెంబరు 15: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 4 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 7500 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో ఉండగా పెన్నాకు 4 వేల క్యూసెక్కులు, ఉత్తర కాల్వకు 80 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 90 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోట నుంచి మైలవరానికి మరింత నీరు ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి నీటి విడుదల మరింత పెంచుతామని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. మైలవరం జలాశయ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న కారు

● కరెంటు సరఫరా లేక తప్పిన ప్రాణనష్టం



ప్రధాన రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొన్న కారు

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: కోవెలకుంట్ల రోడ్డు ఎస్.ఉప్పలపాడు గ్రామ సమీపాన రైల్వే ట్రాక్ దగ్గర ఆదివారం కారు కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఐదుగురు స్నేహితులు కర్నూలు జిల్లా డోన్ ఎల్లుర్తి నుంచి కారులో జమ్మలమడుగు మీదుగా ప్రొద్దుటూరుకు వెళుతున్నట్లు వారు తెలిపారు. కారు అదుపు తప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో విద్యుత్తు స్తంభం విరిగి కారుపై పడింది. కరెంటు తీగెలు కొంచెం ఎత్తులో ఉండడం వలన విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు తెలియజేశారు. అదే దారిలో వెళుతున్న కొందరు విద్యుత్తు అధికారులకు సమాచారం ఇచ్చి కరెంటు సరఫరా లేకుండా నిలిపివేశారు. దీంతో కారులో ఉన్న ఐదుగురు బయటకు వచ్చి తమ అదృష్టం దేవుడు కాపాడాడని, లేనిచో పూర్తిగా దగ్ధమయ్యేదని వారు తెలిపారు. ఏది ఏమైనా ప్రాణనష్టం తప్పింది.

పెండింగ్ పీఎఫ్, ఏపీజీఎల్ఐ వెంటనే చెల్లించాలి

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 15: ఉపాధ్యాయుల జీతాల నుంచి దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు ఆరునెలలుగా చేయకపోవడం దారుణమని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఎర్రగుంట్లలో రీజనల్ కన్వీనర్ అన్వర్ బాషా అధ్యక్షతన ప్రాంతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.21వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. 12వ పీఆర్సీ ఆలస్యం అవుతున్నందున వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రమణారెడ్డి, బాలగంగిరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు అంశంపై ప్రభుత్వం స్పందించాలని, ఉద్యోగుల భాగస్వామ్యం లేని పెన్షన్ విధానాన్ని తప్ప మరే ప్రత్యామ్నాయాన్ని ఉపాధ్యాయ సంఘాలు అంగీకరించవన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్, సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయసు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, వీఎన్‌పల్లె, కమలాపురం మండలాల జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు ఎస్.దాదాపీర్, శంకర్‌రెడ్డి, కుండా భాస్కర్, హెచ్ఎంలు ఎస్.రామాంజనేయరెడ్డి, సాంబశివారెడ్డి, సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ.సుకుమార్, ప్రతాప్‌రెడ్డి, విశ్రాంత డిప్యూటీ డీఈఓ మునిరెడ్డి పాల్గొన్నారు.

పత్తి రైతుకు పురుగు భయం

ఎకరాకు రూ.40 వేలు ఖర్చు ● అనుకూలిస్తే లాభమే

తగ్గిన పత్తి సాగు ● రైతుకు అధికారులు సలహాలు ఇవ్వాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: పత్తి రైతుకు పురుగు భయం పట్టుకుంది. మోరగుడి, గొరిగెనూరు, అంబవరం, పొన్నతోట, మైలవరం మండలం దొమ్మరనంద్యాల, వేపరాల, చిన్నకొమెర్ల, పెద్దకొమెర్ల తదితర ప్రాంతాల్లో రైతులు పత్తి పైరు అధికంగా సాగు చేస్తారు. ప్రతి రైతు ఎకరాకు సుమారు రూ.40 వేల దాకా పెట్టుబడులు పెడతారు. ప్రస్తుతం పత్తి పైరును రేగ్గాయ పురుగు ఆశించి కాయను తినేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలకు వ్యవసాయాధికారులు రావడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలో పత్తి రూ.76 నుంచి రూ.80 వరకు ధర పలుకుతుండడంతో తెగుళ్లను తట్టుకుని పూర్తి దిగుబడి సాధిస్తే లాభాలు కళ్లచూడవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు పైరును పరిశీలించి, పురుగు బారినుంచి పంటను రక్షించుకునేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సాగు చేసిన పత్తి పంట

శెట్టిపల్లె హైస్కూల్‌కు రాజకీయ గ్రహణం

● రూ.64 లక్షలు నాడు- నేడు నిధులు వెనక్కి
● మౌలిక వసతులకు విద్యార్థులు దూరం
● కూటమి ప్రభుత్వంతో వసతులు సమకూరేనా



మురుగును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

సంబేపల్లె, సెప్టెంబరు 15: వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన నాడు-నేడు పనులు నిర్వీర్యమై మంజూరైన రూ.64 లక్షల నిధులు మురిగిపోయాయి. రాజకీయ కారణాలతో విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించలేదు. ఫలితంగా నిత్యం విద్యార్థినీ, విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతమైన శెట్టిపల్లి జడ్పీహైస్కూల్‌లో 161 మంది పేద విద్యార్థులు చదువుతున్నా వారికి సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు. వివరాల్లోకెళితే....

శెట్టిపల్లి జడ్పీహైస్కూల్‌లో 161 మంది పేద విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైసీపీ ప్రభుత్వంలో మౌలిక వసతుల కింద నాడు-నేడు నిధులు రూ.64 లక్షలు మంజూరు చేశారు. రాజకీయ కారణాలతో విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించలేదు. వైసీపీ ప్రభుత్వంలో పాఠశాల స్కూల్ కమిటీ చైర్మెన్ టీడీపీ వ్యక్తి కావడంతో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఖర్చు చేయకుండా వదిలేశారు. దీంతో నిధులు వెనక్కిపోయాయి. పాఠశాలలో విద్యార్థులు కనీస వసతులు లేక రోజూ అవస్థలు పడుతున్నారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలు

పాఠశాల చుట్టూ ప్రహరీ లేదు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వర్షం వస్తే తరగతి గదులు ఉరుస్తున్నాయి. తలుపులు, కిటికీలు కూడా సక్రమంగా లేవు. పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. వంట గదులు, గోడల వరకు కట్టి వదిలేశారు. మొండి గోడలు పిచ్చిమొక్కల మధ్య ఆరుబయట వంట చేస్తున్నారు. మురుగు కాల్వల ద్వారా వచ్చే నీరు పాఠశాల ప్రాంగణలో చేరి మడుగును తలపిస్తున్నాయి. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం లేదు. బాలికలకు మరుగుదొడ్లు లేక ఆరుబయట అవస్థలు పడుతున్నారు. మూడో తరగతి నుంచి 10వతరగతి వరకు ఉన్న బాలికలు మరుగుదొడ్డిని కూడా సక్రమంగా లేక వినియోగించుకోవడం లేదు. పాఠశాలలో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా విద్యార్థుల కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

నిధులు వెనక్కిపోయాయి

పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనలు అందిస్తున్నాం. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలంటే కనీసం నిధులు కూడా లేవు. నాడు- నేడు నిధులు 64 లక్షల వెనక్కిపోయాయి. ప్రస్తుతం నిధులు మంజూరైతే విద్యార్థులకు వసతులు కల్పిస్తాం.

- చిన్నరెడ్డెప్ప, హెచ్ఎం, శెట్టిపల్లి

విద్యార్థులు అవస్థలు పడుతున్నారు



మారుమూల ప్రాంతం నుంచి వచ్చే ఆడపిల్లలు మరుగుదొడ్లు లేక ఆరుబయట వెళుతున్నారు. పిల్లల భద్రత లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన నిధులను తిరిగి మంజూరు చేయాలి. పిల్లల సమస్యలు స్థానిక నేతలతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాలకు వసతులు కల్పిస్తాం.

- బాషావల్లి, స్కూల్ కమిటీ చైర్మెన్, శెట్టిపల్లి



డోరు కూడా సక్రమంగా లేని మరుగుదొడ్డి



పిచ్చిమొక్కలతో ఉన్న పాఠశాల ప్రాంగణం



ఆరుబయటే వంట చేస్తున్న దృశ్యం

కొత్త ఆవిష్కరణలకు ప్రసిద్ధి జీనోమిక్స్ బయోటెక్

● ప్రొఫెసర్ రత్నగిరి పోలవరపు



అవార్డును అందుకుంటున్న శాస్త్రవేత్త డాక్టర్ వినయ్‌చంద్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 15: ఆరోగ్య సంరక్షణ మెరుగుదల కోసం వినూత్న ఆవిష్కరణలను జీనోమిక్స్ బయోటెక్ ద్వారా అందిస్తున్నామని జీనోమిక్స్ ప్రెసిడెంట్ సీఈఓ రత్నగిరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మేం ఐవీఆర్ఐ వారితో కలిసి కోళ్లవ్యాధులపై చేసిన పరిశోధనలకు బీఐఆర్ఏసీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ భారత ప్రభుత్వ ఇన్నోవేటర్ అవార్డును ఇచ్చారన్నారు. ఈ అవార్డును డీబీటీసీ సెక్రటరీ రాజేశ్ సుధీర్ గోఖలే చేతుల మీదుగా అందుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మా జీనోమిక్స్ బయోటెక్ ద్వారా మరిన్ని పరిశోధనలు చేస్తామన్నారు. 2003లో జీనోమిక్స్ బయోటెక్ అత్యాధునిక పరిశోధన కేంద్రాన్ని స్థాపించామన్నారు. నాటి నుంచి మేంజీనోమిక్స్ మాలిక్యులర్ డయాగ్నోస్టిక్ ప్రైవేటులిమిటెడ్, జీనోమిక్స్ హెల్త్ కేర్ ఆఫ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ జెనోమిక్స్ కార్ల్ ప్రైవేటు లిమిటెడ్ వంటివి ప్రభుత్వ ప్రైవేటు సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఏపీ ప్రభుత్వంతో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పులివెందులలో జీనోమిక్స్ కార్ల్ ప్రైవేటు లిమిటెడ్ ఏర్పాటు చేశామన్నారు. మా పరిశోధన కేంద్రం మానవ ఆరోగ్య అవసరాలకు సంబంధిత వ్యాధిని గుర్తించే కిట్లను కూడా అందిస్తుందన్నారు. మరీముఖ్యంగా మలేరియా, డెంగ్యు, హెచ్ఐవీ, హెచ్‌సీవీ సహా జంతువుల ఆరోగ్య అవసరాలకు సంబంధించిన బ్రూసెల్లో సిస్, టిబా, ఫుట్అండ్ మౌత్ డిసీస్ వంటి వ్యాధి నిర్ధారణ కిట్లను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. 2018లో ఎన్ఆర్‌సీఈ వారి సహకారంతో దేశంలోనే ఏకైక గ్లాండర్స్ వ్యాధి నిర్ధారణ కిట్ కనుక్కున్నామన్నారు. కరోనా సమయంలో కూడా వ్యాధి నిర్ధారించడానికి కావలసిన కిట్లను అభివృద్ధి చేసి కర్నూలులో ల్యాబ్ ఏర్పాటు చేసి అప్పటి ఏపీ ప్రభుత్వానికి సహకరించిందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన జనాభాకు మా పరిశోధన కేంద్రం మద్దతు ఇస్తుందన్నారు. భవిష్యత్తులో జీనోమిక్స్ బయోటెక్ పరిశోధన కేంద్రం ద్వారా ప్రజా పరిరక్షణకు దోహదపడతామని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డును అందిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినితో ఉపాధ్యాయురాలు

వల్లూరు, సెప్టెంబరు 15: ఎస్‌జీఎఫ్ అండర్ 19 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి క్యారంబోర్డ్ పోటీల్లో ఏపీ మోడల్ స్కూలు, కాలేజీ విద్యార్థిని కె.కీర్తన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆదివారం కడప జూనియర్ గర్ల్స్ కాలేజీలో జిల్లాస్థాయి క్యారంబోర్డు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూలులో ఇంటర్ చదువుతున్న కె.కీర్తన మొదటిస్థానం సాధించింది. మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, పీఈటీ సుశీలమ్మ, విద్యార్థినిని అభినందించారు.

కరెంటు వైరు తగిలి బాలిక మృతి

కడప, క్రైం,సెప్టెంబరు 15: కడప నగరం సరోజిని నగర్‌లో ఆదివారం కరెంట్ వైరు తగిలి యాగంటి అల్లిక (11) మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. సరోజినీనగర్ చెందిన యాగంటి అల్లిక 6వతరగతి చదువుకుంటోంది. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లడంతో మధ్యాహ్నం మోటార్ వేస్తుండగా కరెంటు వైరు తగిలి చనిపోయినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎంఆర్‌పీఎస్‌నేతపై బెదిరింపుల కేసు నమోదు

ప్రొద్దుటూరు,సెప్టెంబరు 15: ఎంఆర్‌పీఎస్ నేత సుధాకర్ మాదిగ మరికొందరిపై బెదిరిస్తూ దాడికి యత్నించడంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే 14వతేదీ శనివారం సాయంత్రం శ్రీనివాసనగర్‌లోని తెల్లాకుల మనోహర్ అనే లోక్‌సత్తా నేత ఇంటి దగ్గరికి ఎంఆర్‌పీఎస్ నేత సుధాకర్ మాదిగ, మరికొందరు వెళ్ళి తాత్కాలిక కూరగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మ గుడి పేరుతో మున్సిపల్ స్థలాలు ఆక్రమించారని పెట్టిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఇంట్లోకి వెళ్లి బెదిరించారు. అంతేకాకుండా దాడికి యత్నించారని మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రాణాంతకంగా ఇసుక గుంతలు

పెన్నానదిలో పెరుగుతున్న ప్రవాహం ● విచ్చలవిడిగా నదిలోకి వెళ్తున్న ప్రజలు



పడమరవైపు పెన్నానదిలో ప్రవహిస్తున్న వరదనీరు

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: మైలవరం జలాశయం నుంచి నీరు విడుదల చేస్తుండడంతో పెన్నానదిలో ఇసుక గుంతలున్న వేపరాల, దొమ్మరనంద్యాల, మోరగుడి, జమ్మలమడుగు, పొన్నతోట, గూడెం చెరువు, రాజీవ్ నగర్ కాలనీ, అంబవరం, గొరిగెనూరు తదితర ప్రాంతీయులకు ప్రమాదకరంగా మారింది. నదిలోకి నీరు వస్తుండడంతో ఆయా ప్రాంతీయులు అప్రమత్తంగా ఉండాలని పది రోజుల కిందట మైలవరం ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు, ఇతరులు ద్విచక్ర వాహనాలతో పెన్నానదిలోకి వెళుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పెన్నానదిలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. మూడు రోజుల నుంచి పాఠశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున నదిలోకి వెళుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వారు ప్రమాదాల బారిన పడకుండా వంతెన వద్ద, గ్రామాల సమీప నది వద్ద గ్రామ సేవకులు, పోలీసు సిబ్బందిని నియమించి పెన్నానదిలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





తూర్పు భాగాన ప్రవహిస్తున్న మైలవరం వరదనీరు - ప్రమాదకరంగా ఇసుక గుంతలు

వంకలో దిగి యువకుడు మృతి



మైదుకూరు,సెప్టెంబరు 15: శివపురం వాసి దివ్యాంగుడు గారెల నరసింహ్మ (17) పశువుల మేపు కోసం గ్రామం వెలపల బీడు పొలాల్లో పశువులను మేపుకొంటుండేవాడు. మేపు తిన్న పశువులు నీటి కోసం వంకలో దిగగా వాటితో పాటు వంకలో దిగిన నరసింహ్మ బురదలో కూరకుపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వంక నుంచి మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పీటీసీ డీఎస్పీగా అబ్దుల్‌కరీం

కడప (క్రైం), సెప్టెంబరు 15: జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటరు డీఎస్పీగా ఎస్‌కే అబ్దుల్ కరీంను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన వెయిటింగ్‌లో ఉండగా ఆయనకు పోస్టింగ్ కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 47 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. కొన్ని నెలలుగా కడప డీఎస్పీ ఖాళీగా ఉంది. కడప ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న గిరిధర్‌ను తిరుపతి ఎస్బీకి బదిలీ చేశారు.

మట్టివినాయకుడి నిమజ్జనం



కడప (కల్చరల్) సెప్టెంబరు 15: వినాయక చవితి పర్వదినం సందర్భంగా నగర కో-ఆపరేటివ్ కాలనీలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకుడికి తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. 40 ఏళ్లగా కమిటీ పెద్ద లు అత్యంత భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం స్వామివారిని ట్రాక్టర్‌పై వుంచి కాలనీలోని పలు ప్రాంతాల్లో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారికి వీడ్కోలు పలికారు.

ద్విచక్ర వాహనం- కారు ఢీ

● వ్యక్తికి గాయాలు


గాయపడ్డ వెంకట్రమణ

చిన్నమండెం, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై హిందుస్థాన్ పెట్రోల్ బంకు ఎదురుగా కారు, ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. శిబ్యాల గ్రామానికి చెందిన వెంకట్రమణ పెట్రోల్ కోసం బైకులో వస్తుండగా, రాయచోటి వైపు నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. దీంతో వెంకట్రమణ తలకు, కాలుకు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

గాలివీడు, సెప్టెంబరు 15: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ఈ బిల్లుపై కేంద్ర వైఖరి మారే వరకు పోరాటం కొనసాగిస్తామని ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణంలో వక్ఫ్‌బోర్డు రాజ్యాంగ సవరణ మీద ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింల మనోభావాలు దెబ్బతీసే ఇటువంటి చట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15: నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్, మాజీ ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి తుమ్మల క్రిష్ణచైతన్యలు తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఈ నెల 27 నుంచి 29 వరకు రాజంపేటలో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం, నాయకులు నితీష్, నాగేంద్ర, ప్రవీణ్, బాలాజీ, నవదీప్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన


గిరిజన కాలనీలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15: మండలంలోని కె.బుడుగుంటపల్లె గ్రామ పంచాయతీలోని కన్నెగుంట గిరిజనకాలనీలో ఆదివారం అయ్యప్పస్వామి ఆస్పత్రికి చెందిన వైద్యులు గిరిజనులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు వ్యాధిని బట్టి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 100 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు కుంచపు మణికంత, హారికజ్యోతి, సుస్మితజ్యోతి తదితరులు పాల్గొని గిరిజనులకు వైద్య సేవలు అందించారు.

వేడుకగా గణేశ్ నిమజ్జనం




రాయచోటి పట్టణం కొత్తపేటలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు, రాయచోటి శివాలయం వద్ద విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం, సిద్దవటంలో కోలాటం ఆడుతున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 9వ రోజు రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలో ఏర్పాటు చేసిన 85 వినాయకుడి విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 9 రోజుల పాటు పూజలు అందుకున్న విగ్నేశ్వరుడికి బ్యాండు మేళాలు, బాణాసంచాల మధ్య రాయచోటి పట్టణ పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించి కోలాటాలు, చెక్కభజనలు, డీజే సాంగ్స్‌తో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని కొత్తపేట, ఎన్జీవో కాలనీ, ఎస్ఎన్ కాలనీ, లక్ష్మీపురం, గాలివీడు రోడ్డు, రాజులకాలనీ, రవిహాల్, రెడ్డీస్‌కాలనీ తదితర ప్రాంతాలతో పాటు మండంలోని మాధవరం, శిబ్యాల, దిగువ అబ్బవరం, గొర్లముదివేడు, యండపల్లె తదితర గ్రామాల్లో డప్పులు, మేళతాలాలు, డీజే పాటలతో ఊరేగింపు నిర్వహించారు. వినాయకుడి విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాధరెడ్డి, రూరల్ సీఐ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో రాయచోటి పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

రామాపురం: మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక ప్రతిమలకు పూజల అనంతరం ఆదివారం అంగరంగ వైభవంగా నిమజ్జనం గావించారు. మండలంలోని కుమ్మరపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె, సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లె, గువ్వల చెరువు, బీదవాండ్లపల్లె, గంగనేరు, కల్పనాయుని చెరువు పంచాయతీ అగ్రహారం గ్రామాల్లో నిమజ్జనం చేశారు. అలాగే బీదవాండ్లపల్లెలో గణేశ్ లడ్డూ వేలంపాటలో గడ్డం వెంకటశివారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, రామాంజుల్‌రెడ్డి, గడ్డం సోమిరెడ్డిలు లక్షకు పైగా పాట పాడి లడ్డును వేలంపాటలో దక్కించుకున్నారు. అలాగే రెడ్డివారిపల్లెలో గణేశ్ లడ్డూ వేలంపాట నిర్వహించారు.

చిన్నమండెం: వినాయక నిమజ్జనం సందర్భంగా మండల కేంద్రంలోని బలిజపల్లి వినాయకుడి నిమజ్జనం యాత్ర కన్నుల పండువగా సాగుతోంది. ఉదయం 11 గంటలకు ఆలయ కమిటీ నిమజ్జనాన్ని బలిజపల్లిలో ఇంటింటి పూజలు అందుకుంటూ బస్టాండు కేంద్రంలో చెక్కభజనలు, కోలాటం, డ్రమ్స్, యువత యువకులు గ్రామానికి చెందిన మహిళలు సామూహికంగా డీజీ పాటలతో అలరింపజేశాయి. విగ్రహం బయలదేరినప్పటి నుంచి బస్టాండు కూడలి వరకు పెద్దఎత్తున బాణాసంచాలు కాల్చారు.

లక్కిరెడ్డిపల్లె: చవితి పురస్కరించుకొని మండలంలో వాడావాడలా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి 9 రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం గద్దగుండ్లరాచపల్లె, లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలి, గంగనపల్లె, గుడ్లవారిపల్లె, రెడ్డివారిపల్లె, గల్లావాండపల్లె గ్రామాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. పలువురు వేలం పాటలో లడ్డూలను దక్కించుకున్నారు. హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పెనగలూరు: మండలంలోని పి.కొత్తపల్లె గ్రామంలో 10 రోజుల పాటు తలపెట్టిన చవితి ఉత్సవాలు ఆదివారం జరిగిన వసంతోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఉదయం వినాయక స్వామి మండపం సమీపంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంతో మంది యువకులు పోటీపడి ఉట్టిలో ఉన్న టెంకాయను పగులకొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇదిలా ఉండగా 10 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మొదటిరోజు తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఘనంగా పూజా కార్యక్రమాలు, అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే 9వ రోజు సిద్దిబుద్ధి సమేత కార్యసిద్ది వినాయకస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం గాండ్లపాలెంలో వినాయకచవితి ఊరేగింపు కార్యక్రమం సంబరాలు అంబరాన్నంటాయి. భారీ ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొని వివిధ వేషధారణలతో నృత్య, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఊరేగింపు కన్నుల పండువగా కనువిందు చేసింది. స్వామివారి లడ్డూవేలం పాటలో శ్రీరాం వెంకటక్రిష్ణయ్య కుటుంబీకులు రూ.32 వేలకు లడ్డూ వేలం దక్కించుకున్నారు.

కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వను

● నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి


రూపానందరెడ్డిని కలిసి సమస్యలు తెలుపుతున్న ప్రజలు

పెనగలూరు, సెప్టెంబరు 15: టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ఓబిలి హరిజనవాడకు చెందిన దాదాపు 100 మంది టీడీపీ కార్యకర్తలు, అనుచరులు ఆదివారం ముక్కావారిపల్లెలోని రూపానందరెడ్డి నివాసంలో ఆయనను కలుసుకుని తమ గ్రామ సభ్యులతో పాటు వ్యక్తిగత సమస్యలు కూడా వివరించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, ఓబిలి గ్రామ పెద్దలు తిప్పన జయరామయ్య, లక్ష్మీనరసయ్య, ఆనందనాయుడు, కరీముల్లా, రమేష్, వెంకటయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ అభివృద్ధికి 2012లో ఇళ్లు తొలగించిన అయ్యావు రెడ్డిపల్లె గ్రామంలో నివశిస్తున్న బీసీ కులాల నిర్వాసిత ప్రజలకు న్యాయం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిని కలిశారు. ఏపీఎండీసీ అభివృద్ధి కోసం యాజమాన్యం మాటలను విని అప్పట్లో గ్రామం ఖాళీ చేశామని, నాటినుంచి సుమారు 12 సంవత్సరాలైనా ఇళ్లస్థలాలు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ పోరాటసమితి జేఏసీ నాయకులు ఆర్.వెంకటేశ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ఆర్-5 డేంజర్‌జోన్ గ్రామాలపై చర్చ

మంగంపేట డేంజర్‌జోన్ గ్రామాల తరలింపుపై టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డితో మంగంపేట నాయకులతో చర్చించారు. ఆర్ఆర్-5 నిర్వాసితులకు ఇళ్లపట్టాల పంపిణీ, అలాగే ఆర్ఆర్-2 కుటుంబాలకు పునరావాసం కొరకు ప్రభుత్వం అధికారుల ద్వారా సర్వే చేయించే కార్యక్రమాలపై టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, బీజేపీ నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి మాట్లాడారు.

కోడూరును ఆదర్శ నియోజకవర్గంగా చేస్తా

చిట్వేలి, సెప్టెంబరు 15: కోడూరును ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని కూటమి ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిలు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆర్కే కల్యాణమండపంలో చిట్వేలి మండల కూటమి నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ కూటమి గెలుపునకు సహకరించిన ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. ప్రతి మండలంలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేకే చౌదరి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, బీజేపీ మండల అధ్యక్షుడు బాహూజీ, కట్టా బాలాజీ, లారీ సుబ్బరాయుడు, గుండయ్యనాయుడు, బాలు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేస్తాం'

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 15: మండలంలో తాగునీరు, రోడ్లు త్వరలో ఏర్పాటు చేస్తామని మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని, రూ.3 కోట్లతో త్వరలో తాగునీటి సమస్యను మంత్రి పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువనాయకుడు, మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్, డాక్టర్ షఫీనాయక్, ఆంజనేయులు, చెల్లు శ్రీనివాసులు, జేకే జయచంద్రారెడ్డి, రమణ, జార్ధన్‌రెడ్డి, అంజాద్‌బాష, వెంకటేశ్వరులు, చంద్ర, సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివలింగాకార వినాయకుని లడ్డూ


ఆకర్షించిన శివలింగాకార లడ్డూ

రాజంపేట, రాజంపేట పట్టణం టి.అగ్రహారం రైల్వేక్వార్టర్స్ ప్రాంగణంలో వినాయక ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శివలింగాకార లడ్డూ విశేషంగా ఆకర్షించింది. స్థానిక యువకులు, వినాయకమిటి సభ్యులు చెంగల్‌రాజు, వారి స్నేహితులు ప్రత్యేకంగా శివలింగాకారంలో లడ్డూను ఏర్పాటు చేసి వినాయక మంటపంలో పెట్టడంతో అందరిని ఆకర్షించింది. ఈ వినాయక విగ్రహ లడ్డూకు ప్రత్యేక అలంకరనలు చేయడంతో వినాయక విగ్రహంతో పాటు లడ్డూను కూడా ప్రత్యేకంగా పూజించారు.

ఓబులవారిపల్లెలో పర్యటించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు సమస్యలు తెలియజేస్తున్న గ్రామ నాయకులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 15: ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీ పట్టణంలోని పలువీధుల్లో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పర్యటించారు. వీధుల్లో నివాసం ఉన్న వారు మురుగునీటి వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలుపగా యువ నాయకులు సాయివికాస్‌రెడ్డితో కలిసి మురికి కాలువలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డితో పాటు స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు వాసుదేవరెడ్డి, యువనాయకులు ఓపీ ప్రసాద్, విజయ్‌కుమార్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, బాలు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, సెప్టెంబరు 15: మండలంలోని ఉర్లగట్టుపోడు పంచాయతీలోని ఎగువపల్లె గ్రామానికి చెందిన అందె పెంచలమ్మ కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదివారం బాధితురాలిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలికి మెరుగైన చికిత్స కోసం సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కువైత్‌లో రక్తదాన శిబిరానికి ఆహ్వానం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15: మొట్ట మొదటిసారిగా గల్ఫ్ దేశమైన కువైట్‌లో సలాం అబ్దుల్‌కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహారక్తదానం శిబిరం జరగనుంది. ఈ కార్యక్రమానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు, బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ, తన సేవలను భారతదేశమంతటా విస్తరించటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. అందులో భాగంగానే కువైత్‌లో రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

- పచ్చని చెట్లు సైతం తొలగింపు

సిద్దవటం, సెప్టెంబరు 15: మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ కడప - చెన్నై రహదారిలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది. రైల్వేట్రాక్ సమీపాన ప్రభుత్వ భూమి సర్వేనంబరు 936/ఎలో దాదాపు 10 సెంట్ల భూమిని ఆక్రమణదారులు ఎక్సకవేటర్ సాయంతో చదును చేసి అక్కడ ఉన్న పురాతనమైన యల్లమ్మగుడిని ధ్వంసం చేశారని కాలనీవాసులు పేర్కొన్నారు. గతంలో రెవెన్యూశాఖ వారు హెచ్చరిక బోర్డు నాటారని, వాటిని కూడా తొలగించారని భక్తులు పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. సమాచారం తెలిసిన వెంటనే తమ సిబ్బంది అక్కడికి వెళ్లారని, ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ప్రభుత్వ భూమిలో తొలగించిన చెట్లు

150 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామాపురం, సెప్టెంబరు 15: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అరవింద్ హాస్పిటల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 50 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. అర్హులైన వారిని ఆదివారం తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పీఎస్ హరినాథ్‌రెడ్డి తెలియజేశారు. అనంతరం క్యాంపు నిర్వాహకుడు లయన్స్ అంజనారెడ్డి, డాక్టర్ లయన్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ మండలంలో పేద ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో వెంకట్రామిరెడ్డి, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, శివారెడ్డి, గడికోట భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, మదన, దేరంగుల శంకర్, రాంమోహన్, నారాయణ, అరవింద్ కంటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం


మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజంపేట, సెప్టెంబరు 15: అన్నమాచార్య యూనివర్శిటీ రాజంపేటలో జాతీయ ఇంజనీర్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఈ సందర్భంగా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణలు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో స్థిరత్వ ఎదుగుదల ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక సమాజంలో ఇంజనీరింగ్, సాంకేతికత కేంద్ర బిందువుగా మారిందని పేర్కొన్నారు. ఆర్థికంగా, పర్యావరణ పరంగా, సామాజికంగా స్థిరత్వాన్ని సాధించాలంటే ఇంజనీరింగ్ పాత్ర ముఖ్యమైందని తెలియజేశారు. అనంతరం డీన్, ప్రొఫెషనల్ బాడీస్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడారు. తదనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఐఈఐ కన్వీనర్ డాక్టర్ పీవీ సంజీవ్‌కుమార్, పీఆర్వో డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్, డీన్ వివిధ విభాగాధిపతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ఉపన్యాసం

నందలూరు, సెప్టెంబరు 15: కడపలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కోటిరెడ్డి రామ సుబ్బమ్మ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ నెల 17 నుంచి వ్యక్తిత్వ వికాసంపై ఉపన్యాసం ఉంటుందని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతల గురించి ఉపన్యసించాలని తనతో పాటు రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా ఆహ్వానించారని తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ న్యూఢిల్లీలోని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుకు 21 రోజుల పాటు కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు.

పబ్లిసిటీ కోసమే మెడికల్ కళాశాల

● టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్


విలేకర్లతో మాట్లాడుతున్న వేణుగోపాల్

నందలూరు, సెప్టెంబరు 16: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు కేవలం పబ్లిసిటీ కోసమే పులివెందుల మెడికల్ కళాశాలను ప్రారంభోత్సవం చేశారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ విమర్శించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కనీసం 40 శాతం కూడా పూర్తవ్వని కళాశాలను ప్రారంభోత్సవం చేశారని ఆరోపించారు. వైసీపీ నాయకులు చంద్రబాబును విమర్శించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీనేపల్లి హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలి

● మంత్రికి నాగోతు వినతి

రాజంపేటటౌన్, సెప్టెంబరు 15: రాజంపేట నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులను తిరిగి పునరుద్ధరించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజంపేట - శ్రీశైలం, రాజంపేట - హైదరాబాదు, రాజంపేట- చెన్నై, రాజంపేట - పెంచలకోన, అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక, రాజంపేట- తిరుమల బస్సులను రద్దు చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్న ఈ బస్సులను పునరుద్ధరించాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి రాజంపేటకు విద్యార్థులు వస్తుంటారని, వారికి నిలువనీడ లేదని పేర్కొన్నారు. రాజంపేటకు ఒక మంచి బస్టాండు కూడా నిర్మించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, సెప్టెంబరు 15: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.సతీష్‌రెడ్డి, ఎం.జగదీష్, ఎం.వర్షిత్‌కుమార్‌రెడ్డి, ఎన్.తేజేశ్వర్‌రెడ్డిలు ప్రతిభ చూపి నవంబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే క్యారమ్స్ పోటీల్లో ఎన్.తేజశ్విరెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా పీడీ నీలకంఠరావును, క్రీడాకారులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 15: గడిచిన 80 సంవత్సరాలుగా ఉపాధ్యాయ సమస్యల పట్ల ఏపీటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార్‌యాదవ్, మహమ్మద్ ఇలియాస్‌లు అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సంఘ స్థాపన జరిగి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రమైన పట్టణ పరిధిలోని మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో వేడుకల జిల్లా సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, విద్యారంగం, ప్రభుత్వ విద్యా విధానాలు, బోధనావస్థలు, విధానపర అంతరాయాలు, పనిఒత్తిడి, ఆర్థిక ప్రయోజనాలు- బకాయిలు వంటి పలు అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ కార్యక్రమలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అదనపు కార్యదర్శి మందడి చెంగల్రాయ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, చిత్తూరు జిల్లా ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ త్యాగరాజునాయక్, సీనియర్ నాయకులు చంద్రయ్య, కృష్ణయ్య, సంఘ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ.59 వేలు

వీరబల్లి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా ఆదివారం జరిగిన 12 కేజీల లడ్డు వేలంపాటలో రూ.59 వేలకు మాజీ సర్పంచ్ తుమ్మల గింజల వెంకట్రమణ, సాయిరాం ఫైర్ వర్క్స్ తుమ్మగింజల అంజనేయులు కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. వినాయక కమిటీ సభ్యులు వీరిని సత్కరించి బ్యాండు మేళంతో వినాయక స్వామి లడ్డూను ఇంటి వద్దకు చేర్చారు. మండల వ్యాప్తంగా వినాయక చవితి పురష్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గంగ ఒడికి గణనాథుని చేర్చారు.

మొగిలి ఘాట్ ప్రమాదంలో
తీవ్రంగా గాయపడ్డ మహిళ మృతి

- మృతురాలి స్వగ్రామం పాపిరెడ్డిపల్లెలో విషాద ఛాయలు


పద్మావతి (ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15: మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పద్మావతి(49) ఆదివారం మృతి చెందింది. ఈమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చే ముందే ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. వైద్యులు శ్రమించి పీసీఆర్ చేసి బతికించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమెది గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె గ్రామం. ఈ విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హన్సికకు దహనక్రియలు పూర్తి

మహారాష్ట్రకు చెందిన అషతోష్, రిక్కీ, వారి పిల్లలు హన్సిక(6), అష్మిత్ యాదవ్(3)లతో కలిసి బెంగళూరులో ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనులు చేసుకుని జీవిస్తున్నారు. శ్రీవారి దర్శనం కోసం వారు తిరుమలకు వచ్చి బెంగళూరుకు తిరుగు ప్రయాణమవుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అషతోష్ కుమార్తె హన్సిక అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలినవారు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు మొదటగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. హన్సిక మృతదేహాన్ని కూడా వారితోపాటు స్విమ్స్ మార్చురీలో ఉంచారు. ఆదివారం అషతోష్ బంధువులు తిరుపతికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో స్థానిక గోవిందధామంలో హన్సికకు దహనక్రియలు నిర్వహించారు. ఈ సమయంలో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

నిలకడగానే కండక్టర్ ఆరోగ్యం

తీవ్రంగా గాయపడిన బస్సు కండక్టర్ చిరంజీవి(34) తమిళనాడులోని రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ముఖానికి ఒకసర్జరీ చేయాల్సి ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

డీసీసీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘుబాబు


రఘుబాబు - గంగిరెడ్డి

చిత్తూరుకలెక్టరేట్, సెప్టెంబరు 15: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ చిత్తూరు యూనిట్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక డీసీసీబీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఏపీసీసీబీ చైర్మన్ సీహెచ్ మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.రఘుబాబు, జిల్లా కార్యదర్శిగా వై. గంగిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి. ధనుంజయరెడ్డి, కోశాధికారిగా ఎం.రమేష్, సభ్యులుగా సి.శ్రీదేవి, లక్ష్మీప్రసాద్ నాయుడు, ఎస్.నాగమణి, కె.రాజశేఖర్, ఎ.పవిత్ర, బి.గురునాథం, భువనేశ్వరి, ఎస్.జయశేఖర్, సి.నాగరాజ, కమిటీ గౌరవ సలహాదారుడుగా కె.వెంకటాచలపతి ఎన్నికయ్యారు. బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, డీజీఎం, ఏజీఎంలు పాల్గొన్నారు.

ఆరుగురు ఏటీఎం దొంగలకు రిమాండ్

పూతలపట్టు, సెప్టెంబరు 15: ఏటీఎంల వద్ద పలువురిని మోసగిస్తూ నగదు దొంగిలిస్తున్న ఆరుగురిని పూతలపట్టు పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్‌రోడ్డులోని డీసీసీబీ బ్యాంకు ఏటీఎం వద్ద రెండ్రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన టి.ఎన్. మోహన్, ధనుష్, అనంతపురంకు చెందిన కృష్ణమూర్తి, చిత్రదుర్గంకు చెందిన శివలింగం, ఒంగోలుకు చెందిన సుబ్బారావు, తుంబకూరుకు చెందిన అనిల్‌కుమార్‌లు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా సీఐ కృష్ణమోహన్ తమ సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, ఏటీఎం వద్ద అమాయకులనుంచి డబ్బులు కాజేస్తున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి రూ.1.10 లక్షలు స్వాధీనం చేసుకుని శనివారం వారిపై కేసు నమోదు చేసి చిత్తూరులోని రెండో కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. వీరిపై తెలంగాణ, తమిళనాడు, పలు ప్రాంతాల్లో ఇదేతరహాలో కేసులు నమోదయ్యాయని సమాచారం.

రేపు పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 15: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం వైద్య ఆరోగ్య, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 19 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా వైద్య ఆరోగ్య, విద్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో 5,466 పాఠశాలల్లో చదువుతున్న 3.63 లక్షల మంది విద్యార్థులకు మాత్రలు వేయడం జరుగుతుందని చెప్పారు. తొలిరోజే వంద శాతం పూర్తిచేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్వాణ నారాయణ స్వామి సేవలో నేపాల్ మాజీ ఉపాధ్యక్షుడు



పలమనేరు, సెప్టెంబరు15 : పలమనేరు విష్ణుపురిలో ఉన్న నిర్వాణ నారాయణ స్వామిని ఆదివారం నేపాల్ మాజీ ఉపాధ్యక్షుడు పరమానందఝా దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పరమానందఝా నేపాల్ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చి అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో పలమనేరుకు వచ్చారు. ఆయనతో పాటు నేపాల్‌కు చెందిన ప్రదీప్‌ఖనాల్, సీర్జానా, నేపాల్ పర్యాటకశాఖ మంత్రి మాజీ సలహాదారు డాక్టర్ సుభాష్‌షా, కృష్ణకుమార్ శ్రేష్ఠి, నేపాల్‌కు చెందిన పలువురు నిర్వాణ నారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారికి అర్చకులు, ఆలయ చైర్మన్ సురేష్ పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పరమానందఝా మాట్లాడుతూ పలమనేరులోని నిర్వాణ నారాయణ స్వామి అచ్చు ఖాట్మండ్‌లోని ఆలయంలో స్వామి వారిని పోలి ఉన్నారని పేర్కొన్నారు.

ఐదుగురు డీఎస్పీలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15:తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బి.ప్రసాద్‌ను చంద్రగిరికి, సీఐడీ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావును రేణిగుంటకు, ఏసీబీలో పనిచేస్తున్న వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, వీఆర్‌లో ఉన్న డి.మురళీధర్‌ను తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, రాజగోపాల్ రెడ్డిని తిరుపతి పీటీసీకి నియమించింది.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


అఖిల

తవణంపల్లె, సెప్టెంబరు 15: ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన అఖిల(21)కు వివాహమై భర్తతో విడిపోయి పుట్టింట్లో ఉంటోంది. కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గత వారం కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లో, బంధువులు ఉన్నచోట్ల వెతికినా కనపడలేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరింత.. ఇన్‌స్పైర్ కావాలి..!

● ఇప్పటివరకు వచ్చిన నామినేషన్లు 1,351 ● వచ్చేనెల 15వ తేదీవరకు గడువు
● గత ఏడాది నామినేషన్లలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా టాప్

ఇన్‌స్పైర్ లోగో


నమూనాను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు (ఫైల్ ఫొటో)

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 15: పాఠశాల స్థాయి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహిస్తోంది. గత ఏడాది ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 5,720 ప్రాజెక్టుల నామినేషన్లు రావడంతో రాష్ట్ర స్థాయిలో చిత్తూరు మొదటి స్థానంలో, దేశ స్థాయిలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. కాగా, గత ఏడాది ఇన్‌స్పైర్ ద్వారా మన జిల్లా విద్యార్థులు రాష్ట్రం, దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా (జపాన్-సకుర)నూ సత్తా చాటారని జిల్లా సైన్స్ అధికారి ఆర్వీ రమణ తెలిపారు. మన విద్యార్థులు రూపకల్పన చేసిన రెండు నమూనాల (ప్రాజెక్టుల)కు పేటెంట్ హక్కులను జపాన్ ప్రభుత్వం తీసుకుందని గుర్తు చేశారు.

విభజన జిల్లాల ప్రాతిపదికన తొలిసారి..

రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన తర్వాత తొలి సారిగా 31 మండలాల పరిధి కలిగిన చిత్తూరు జిల్లా నుంచి నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. జూలై 16న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ అక్టోబరు 15 నాటికి ముగియనుంది. కాగా ఇప్పటి వరకు రాష్ట్రంలోనే అత్యధికంగా మన జిల్లా నుంచి 1,351 నామినేషన్లు వచ్చాయి. ఇదే పంథాను కొనసాగిస్తే మరోసారి చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి..

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి నామినేషన్ దాఖలు చేయొచ్చు. జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, గణిత శాస్త్రం ఉపాధ్యాయులు ప్రత్యేక భూమిక పోషించాల్సి ఉంది. ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు ప్రాజెక్టుల నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్


వేమూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మెక్సికో బృంద ప్రతినిధులు, పక్కనే విజయ్ కుమార్ - బీజామృతం, ఘన, ద్రవ జీవామృత తయారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 15 : ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం దాగి ఉందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు మెక్సికో ప్రతినిధుల బృందం ఆదివారం తిరుపతి జిల్లాలో పర్యటించింది. తొలుత కరకంబాడి రోడ్డులోని ఓ హోటల్‌లో బృందంతో సమావేశం జరిగింది. ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్ఎఫ్), ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇందులో వివరించారు. మెక్సికో బృందంతో పాటు ప్రజాసంస్థల తరపున పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు హాజరయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాకుండా ప్రజారోగ్యం, భూ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఏపీసీఎన్ఎఫ్ ఎతో కలిసి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తరించి రసాయన రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణ సులభతరమవుతోందన్నారు. మెక్సికో ప్రతినిధి బృంద ప్రతినిధులు మాట్లాడుతూ తమ దేశంలోని వాతావరణ పరిస్థితులను, వ్యవసాయ విధానాలను, పంటల వివరాలను తెలియజేశారు. నౌ పార్టనర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుసాధికార సంస్థతో భాగస్వామ్యం కావడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రైతుసాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్‌మరియా, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రామిరేజ్ పార్డో ఎరికాసోమి, మెక్సికన్ నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు లోపెజ్ మెర్లిన్ డేవిడ్, ఇనైయాస్ సోలాజానో మంజానో, ప్రాగోసో విల్లావిసెన్సియా పాబ్లో, నౌ పార్టనర్స్ ప్రతినిధులు, ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తర్వాత మెక్సికో బృందం తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్పనాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సి.రామాపురంలో మహిళా సంఘాలు, గ్రామ ఐక్యసంఘాల ప్రతినిధులతో మాట్లాడారు.

గోవిందరాజ స్వామికి పవిత్రాల సమర్పణ



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 15: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం అర్చకస్వాములు పవిత్రాలను శాస్త్రోక్తంగా సమర్పించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన జరిగాయి. ఆ తరువాత గోవిందరాజ స్వామి ఆలయంలోని వివిధ దేవతామూర్తులకు అర్చకులు పవిత్రాలను వేదమంత్రాల మధ్య సమర్పించారు. ఉత్సవాలు సోమవారం ముగుస్తాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, తిరుమల పెద్ద జీయర్ స్వాములు, అర్చకులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో...



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటీశుడి ఆలయంలో మూడో రోజు ఆదివారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణాహుతులు సమర్పించారు. ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో అంకురార్పణ


పుట్టమట్టిని సేకరిస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 15: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఆదివారం ఉత్సవాలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ గావించారు. అంతకు ముందు ఫ్రైడే గార్డెన్ నుంచి అర్చకులు పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. భక్తులు ఒక్కొక్కరు రూ.750 చెల్లించి ఒకరోజు పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. 2లడ్డూలు, 2 వడలు బహుమానంగా అందిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా ఆలయంలో ఆర్జిత సేవలు టీటీడీ రద్దు చేసింది.

బాలుడిపై కేసు నమోదు

చిత్తూరు, సెప్టెంబరు 15: బోరు మోటారు స్టార్టర్‌ను చోరీ చేసిన ఓ బాలుడిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. సంతపేట గాండ్లవీధిలోని ఓ ఇంటి వద్ద ఉన్న బోరు స్టార్టర్‌ను ఆదివారం ఓ బాలుడు ఎత్తుకెళుతుండగా స్థానికులు గుర్తించారు. ఆ బాలుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు, ఎల్లుండి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 15: పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని తిరువణ్ణామలైకి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 4గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయన్నారు. బుధవారం వేకువజామున 3గంటల వరకు కొనసాగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు నేరుగా వచ్చినవారికి కూడా నాన్‌ఏసీ, ఏసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ముందస్తు రిజర్వేషన్ ద్వారా రాకపోకలకు టిక్కెట్ బుకింగ్ చేసుకుంటే 10శాతం రాయితీ సదుపాయం కల్పించారు. మరిన్ని వివరాల కోసం 9959225686 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం

● మరో యువకుడికి తీవ్రగాయాలు


వెంకటేష్(పాతచిత్రం)

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి వద్ద వెంకటగిరి - ఏర్పేడు రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లికి చెందిన కృష్ణయ్య, ధనమ్మ దంపతులు రైతులు. వీరికి ఇద్దరు కుమార్తెలతో పాటు వెంకటేష్(19) కుమారుడు ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో డిప్లొమా కోర్సు చేస్తున్న వెంకటేశ్ వరుస సెలవులు కావడంతో శనివారం స్వగ్రామానికి వచ్చాడు. పెద్దనాన్న కుమారుడు జయకుమార్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం నైపుణ్య శిక్షణ పొందుతున్నాడు. ఈ ఇద్దరు అన్నదమ్ములు ఆదివారం సొంతపనుల నిమిత్తం వెంకటగిరికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి నుంచి ఓ ట్రాక్టర్ వెంకటగిరి - ఏర్పేడు రహదారిపైకి ప్రవేశించే సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా జయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు గాయపడిన జయకుమార్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రుయాకు తరలించారు. సీఐ రవినాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో కడతేరిపోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

ఇక ఫ్రెండ్లీ ఎస్ఆర్వోలు

- ప్రజలకు చేరువగా సబ్ రిజిస్ట్రార్లు


తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంతో కూడిన ప్రత్యేక ఛాంబర్, ఆదివారం వాటిని తొలగించిన దృశ్యం

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (ఎస్ఆర్వో) రాచరికపు పోకడలకు స్వస్తి పలికేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం, రాజదర్బార్ లాంటి కుర్చీలను తొలగించారు. పార్టీషన్ తీసేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నట్టుగానే సబ్ రిజిస్ట్రార్ల కుర్చీ, టేబుల్‌తో పాటు కార్యాలయానికి వచ్చేవారు కూర్చునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసే ప్రజలకు తగిన గౌరవం ఉండాలని కూటమి ప్రభుత్వం భావించింది. న్యాయస్థానాల్లో జడ్జిల తరహాలో సబ్ రిజిస్ట్రార్లు కూర్చొనే విధానానికి చెల్లుచీటి పలికింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమైతే వారికి మంచినీరు, టీ ఆఫర్ చేసి గౌరవించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఉత్తర్వుల మేరకు వెంటనే పనులు ప్రారంభించామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరాములు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. జిల్లాలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాదాపుగా తొలగింపు పనులు పూర్తి చేశామన్నారు. సోమవారం ప్లాస్టింగ్ వంటి సివిల్ పనులు పూర్తి చేసుకుని, మంగళవారం నుంచి ఫ్రెండ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చూస్తారని చెప్పారు.

భక్తులతో బోయకొండ కిటకిట


ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం వేచివున్న భక్తులు

చౌడేపల్లె, సెప్టెంబర్ 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిట లాడింది. ఉదయాన్నే వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

● పరారీలో మరొకరు : డీఎస్పీ


నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు, సెప్టెంబరు 15: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన నలుగురిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. మరోవ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలను రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్ మీడియాకు తెలిపారు. సంతపేట ఇందిరానగర్‌కు చెందిన వసంత్ తిరుపతిలోని ఓ మారుతీ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల వసంత్ తల్లి మరణించడంతో 12వ రోజు కార్యానికి చిత్తూరుకు వచ్చాడు. తన పక్కింటి వాళ్లతో కలిసి కట్టమంచి వినాయక నిమజ్జనానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరగా చర్చివీధిలో వెనుక నుంచి ఇందిరానగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ అనే వ్యక్తి మరో వాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ అక్కడ వాదులాడుకోగా బంధువులు సర్దిచెప్పడంతో వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఆగ్రహానికి గురైన అరుణ్‌కుమార్ తన కుమారులు గిరీష్, యశ్వంత్, అతడి షాపులో పనిచేసే జయరామ్, చిట్టిబాబులతో కలిసి లిల్లీ బ్రిడ్జి వద్ద ఇనుపరాడ్లతో వసంత్‌పై దాడి చేశారు. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వసంత్ ఇచ్చిన ఫిర్యాదుతో దాడిచేసిన నలుగురిని ఆదివారం కాణిపాకం క్రాస్ వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న యశ్వంత్ కోసం గాలిస్తున్నారు. ఈ తరహా దాడులకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో తిరుపతి వాసి మృతి


నాగరాజు మృతదేహం

విజయపురం, సెప్టెంబరు 15: అనుమానాస్పద స్థితిలో నాగరాజు(37) మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజుకు 2012లో వివాహమై తిరుపతి ఆటోనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇతను జంబాడ బస్టాండు సమీపంలో రోడ్డు పక్కన చెట్ల మధ్యలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి శవ పరీక్షల నిమిత్తం పోస్టుమార్టంకు పంపారు. మృతుడికి తన అన్న భార్యతో సంబంధం ఉండడంతో స్వగ్రామానికి వెళ్లేవాడని, మృతిపై అనుమానంగా ఉందని భార్య ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ గోవిందరాజులు తెలిపారు.

వేరుశనగ ఎండుతోంది

- మొహం చాటేసిన వరుణుడు....జాడలేని చినుకు
- వర్షాభావ పరిస్థితులతో నిలువునా ఎండుతున్న పంట
- వర్షం పడకుంటే తీవ్ర నష్టమే
- ఏటా వెంటాడుతున్న కష్టాలు..నష్టాలు
- అప్పులు తీర్చడమెలా అంటున్న అన్నదాతలు





ములకలచెరువు, సెప్టెంబరు 15: వరుణుడు ముఖం చాటేయడంతో చినుకు జాడలేక ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట నిలువునా ఎండుతోంది. వానాకాలంలోనూ ఎండలు మండుతున్నాయి. ప్రతి ఏటా అతివృష్టో... అనావృష్టో వేరుశనగ రైతులను ముంచుతోంది. వర్షాభావంతోనూ లేదా అధిక వర్షాలతోనూ ప్రతి ఏటా ఖరీఫ్ లో సాగు చేస్తున్న పంటలు చేతికి అందక అన్నదాతలకు అప్పులే మిగులుతున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం శ్రమిస్తూ వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు కలిసి రావడం లేదు. అప్పోసొప్పో చేసి పంట సాగు చే స్తూ నష్టాలను చవిచూస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చినుకు రాలక కళ్లెదుటే వేరుశనగ చెట్లు నిలువునా ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాల్లో వర్షాధారంగా ఈ ఖరీఫ్‌లో 6వేల హెక్టార్లలో (15వేల ఎకరాల్లో) వేరుశగన పంట సాగైంది. రైతులు ఎకరాలకు రూ.25వేల వరకు ఖర్చు చేసి పంట సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు ఆశించిన స్థాయిలో పడ్డాయి. దీంతో చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం కాయలు దిగే సమయంలో వర్షభావం నెలకొంది. ఈ పరిస్థితిల కారణంగా వేరుశనగ పంట నిలువునా ఎండుతోంది. వారంలో రోజుల్లో వర్షం కరవకపోతే పంట చేతికొచ్చే పరిస్థితులు కన్పించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

భారీగా తగ్గిన వేరుశనగ పంట సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు భారీగా తగ్గిపోయింది. ప్రతి ఏటా రైతన్నలు నష్టాలు చవిచూస్తుండడంతో వేరుశనగ పంట సాగు చేయడం వదిలేశారు. 2022 ఖరీఫ్‌లో భారీ వర్షాల కారణంగా పంట చేతికందలేదు. 2023లో తొలుత అదునులో వర్షాలు పడ్డాయి. దీంతో వేరుశనగ పంటను కోటి ఆశలతో సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నిలువునా ఎండిపోయాయి. దీంతో రైతులు పంటను నష్టపోయారు. వరుసగా నష్టాలు వస్తుండడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో గత ఏడాది కంటే తక్కువగా సాగు చేశారు. ఇప్పుడు కూడా కాయలు దిగే సమయంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం కురవకపోలే ఈ ఏడాది కూడా తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

పంట నిలువునా ఎండుతోంది



మూడు ఎరకాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. దీనికి గానూ రూ.40వేలకుపైగా ఖర్చు అయ్యింది. వర్షాలు సకాలంలో కురవడంతో పంట చేతికొస్తుందని ఆశలు పెట్టుకున్నాను. చెట్లు ఏపుగా పెరిగాయి. కాయలు దిగే సమయంలో వర్షం పడడంలేదు. వర్షం కురవకపోతే పంట చేతికొచ్చే అవకాశాలు ఉండవు. ఇప్పుడు వాన రాక పంట ఎండిపోతోంది.

-వనజమ్మ, పర్తికోట, ములకలచెరువు మండలం

వారం రోజుల్లో వర్షం పడకపోతే తీవ్ర నష్టం



మూడు ఎకరాల్లో పంట సాగు చేశాను. రూ.30వేలు ఖర్చు వచ్చింది. వానరాకపోవడంతో కళ్ల ముందు వేరుశనగ పంట ఎండుతుంటే గుండె తరుక్కుపోతోంది. విత్తనాలు విత్తే సమయం నుంచి వాన పడింది. గత ఏడాది పంట సాగు చేసి నష్టపోయాను. ఇప్పుడు కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంట చేతికొస్తుందో లేదోనన్న భయం నెలకొంది. వరణ దేవుడు కరుణించాలి.

-వెంకటరమణ, చిటికివారిపల్లె, ములకలచెరువు మండలం

ఎస్ఈబీ రద్దు హర్షణీయం



సీఎం, ఎక్సైజ్‌మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15:రాష్ట్రంలో ఎస్ఈబీ విభాగాన్ని రద్దు చేసి ఎక్సైజ్‌శాఖలో విలీనం చేయడం హర్షణీయమని మదనపల్లె ఎక్సైజ్ సీఐ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌పై వున్న బోర్డును ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌గా పేరు మార్చడంతో పాటు సీఎం చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పోలీసులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాతృశాఖలో విలీనం కావడం సంతోషంగా ఉందని, ఇప్పటి నుంచి సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం ముగ్గురికి తీవ్ర గాయాలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 15:బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ కాండ్లమడుగు క్రాస్ వద్ద జాతీయరహదారి పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు...మదనపల్లె పట్టణంలోని బాలాజి నగర్‌లో నివాసం వుండే చాంద్‌బాషా(28) తన అన్నకుమారుడైన కైఫ్‌వల్లి(11), అతని స్నేహితుడు మహీదర్(15) లతో కలిసి ద్విచక్రవాహనంలో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లులో ఆదివారం జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లివస్తుండగా కాండ్లమడుగు క్రాస్ వద్దకు రాగానే వారి వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో వారు ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు కు తరలించారు.

సారా స్వాధీనం - వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 15: నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 55 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల కథనం మేరకు నక్కలదిన్నె సమీపంలో చుక్కల తాండాకు చెందిన బుక్కే శ్రీనివాసులు నాయక్ సారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి నిందితుడిని పట్టుకుని అతని పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు వితరణ



బ్యాటు, బాలు అందచేస్తున్న జనసేన నేత తోట గిరిధర్

ములకలచెరువు, సెప్టెంబరు 15: స్థానిక కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయంలో ఆదివారం విద్యార్థులకు జనసేన నేత తోట గిరిధర్ బ్యాటు, బాలు వితరణ చేశారు. విద్యార్థులు క్రికెట్ ప్రాక్టీస్ చేసేందుకు బ్యాటు, బాలు లేకపోవడంతో సొంత ఖర్చుతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరమణ, టీడీపీ బీసీ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్కూల్ గేమ్స్ అండర్- 17 ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 15: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్- 17 బాల బాలిక జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 18న మదనపల్లె మండలం పోతబోలు గ్రామంలోని శ్రీవేద స్కూల్‌లో ఉదయం 9 గంటలకు ఉంటుందని ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు, స్కూల్ గేమ్స్ ఉమ్మడి కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనదలిచినవారు 2008 తరువాత పుట్టినవారై ఉండాలని, సంబంధింత ప్రధానోపాధ్యాయుల వద్ద వయస్సు ధృవీకరణ పత్రాలను, ఆధార్ కార్డుతోక్రీడా దుస్తులతో హాజరుకావాలన్నారు. మరెన్నీ వివరాలకు నిర్వాహకులు భద్రయ్య 949082832, వసంత అన్నమయ్య జిల్లా కార్యదర్శి 9010534818, సంయుక్త కార్యదర్శి నాగరాజ్ 7032140712 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

బీసీ కులగణనపై సమావేశం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 15: బీసీ కులజనగణనపై స్థానిక ఈ నెల 17న బీసీ సంఘాల నాయకల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. స్థానిక బహుజన పార్టీ కార్యాలయంలో ఆదివారం బీసీ అసెంబ్లీ రౌండ్ టేబుల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు పులిశ్రీనివాసులు, గంగాధర్, కిషోర్, అర్జున్, గుణ శేఖర్ రవితేజ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం, సెప్టెంబరు 15: వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న ఎంపీపీ అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రాజు పేర్కొన్నారు. సమావేశానికి మండల అధికారు లు, ఎంపీ టీసీ, సర్పంచ్‌లు, సెక్రటరీలు హాజరు కావాలని కోరారు.

66 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



నారే వెంకటరమణ రెడ్డికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

పీలేరు, సెప్టెంబరు 15: ఎక్కడ 1958...ఎక్కడ 2024. రెండింటి మధ్య 66 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఉంది. ఆ సంవత్సరంలో పీలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. నూనూగు మీసాల యవ్వనంలో కలిసి చదువుకున్న తమ తోటి వారిని మరోమారు కలుసుకోవాలన్న ఆశతో ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిక ఏర్పాటు చేసుకున్నారు. వచ్చిన వాళ్లలో చాలా మంది ఎన్నో ఉన్నత ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన వారున్నారు. జీవిత చరమాంకానికి చేరుకున్న వారూ ఉన్నారు. శరీరం సహకరించకపోయినా ఎంతో ఓపికగా దాదాపు 20 మంది అపూర్వ కలయికకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమ చిన్ననాటి జ్ఞాపాలు నెమరువేసుకున్నారు. పీలేరు మండల రిటైర్డు విద్యాశాఖాధికారి రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ 1958, 1959, 1960 విద్యా సంవత్సరాల్లో పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న తాము తొలిసారిగా 2022లో 35 మందితో సమావేశమయ్యాయని, ఆ తరువాత 2023, ఆదివారం మరోమారు కలుసుకున్నామన్నారు. తమ జ్ఞాపకార్థంగా గతంలో తాము పాఠశాలకు రూ.4.50 లక్షలు విలువజేసే ఫర్నీచర్, సోలార్ లైట్, జిరాక్స్ మెషీన్, కంప్యూటర్, ప్రింటర్ వితరణగా అందించామన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ జీవితానికి మెరుగులు దిద్దిన ఆత్మీయ గురువు, దివంగత ఉపాధ్యాయుడు నారే వెంకటరమణారెడ్డికి నివాళులు అర్పించారు. ఈ ప్రపంచాన్ని వీడిన మిత్రుల ఆత్మశాంతికి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు అధ్యాపకులు టి.రాఘవ రెడ్డి, రిటైర్డు హెచ్ఎంలు డి.నారాయణ, ఎం.బలరామకృష్ణ, కో-ఆపరేటివ్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ ఎం.రాజారెడ్డి, మీసాల రాజారెడ్డి, వి.రంగారెడ్డి, స్థానిక వ్యాపారి పీసీ రెడ్డప్ప శెట్టి, రెడ్డప్ప రెడ్డి, డా.రెడ్డప్పరెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి సేవలో నల్లారి దంపతులు



స్వామి వారిని దర్శించుకుంటున్న నల్లారి దంపతులు

గుర్రంకొండ, సెప్టెంబరు 15: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దంపతులు ఆదివారం తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిభావంతో పండుగలు నిర్వహించుకోవాలి



వినాయక మండపం పూజల్లో పాల్గొన్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15: యువత భక్తి భావంతో పండుగలు నిర్వహించుకోవాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వీవర్స్‌కాలనిలో వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా పూజల్లో చినబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన సమయంలో డీజేలు తగ్గించి, ఎవరికి ఇబ్బంది లేకుండా శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అందరూ సామరస్యంగా పండుగ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు బాల, మనోజ్, సుబ్రమణ్యం, వినోద్, అమర్, రెడ్డికుమార్, శ్రీరాములు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వార్షిక పురస్కారోత్సవం



గోపాలకృష్ణను సన్మానం చేస్తున్న సీనియర్ సిటిజన్ సభ్యులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు15: మచిలీపట్నంలోని బందర్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్స్ వార్షిక పురస్కార మహోత్సవం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర, జాతీయ, స్థాయిలో ఉత్తమ సేవలందించినవారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఏపీలోని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ ఆయన సతీమణి ధనలక్ష్మీలకు దుశ్శాలువ కప్పి మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చి ఘనంగా సన్మానించారు. వారితోపాటి మున్సిపల్ కమిషనర్ ఎడిటర్ సత్యనారాయణను విజయవాడ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాధశ్రీ, గోపీచందు, దంపతులను సన్మానించారు.ఈ సందర్భంగా ఎడిటర్ సీనియర్ సిటిజన్ సేవలను గుర్తించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో టీడీపీ నేత జయచంద్రారెడ్డి దంపతులు

తంబళ్లపల్లె సెప్టెంబర్ 15 : తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా టీటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ పవిత్రోత్సవాల్లో టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఆయన సతీమణి కల్పనరెడ్డి కూటమి నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఏవో వరలక్ష్మీ ఆలయ అధికారి దుష్యంత్ కుమార్ ఘన స్వాగతం పలికారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం చతుస్థానార్చనం, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, స్నపన తిరుమంజనం, చక్రస్నానం శాసోక్తంగా నిర్వహించారు. జయచంద్రారెడ్డి దంపతులు పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూ.లు నిర్వహించారు. ఆలయ అధికారులు, వేదపండితులు వారికి కూటమి నేతలకు తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త సీడ్ మల్లికార్జున నాయుడు, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, సిద్దమ్మ, తెలుగు యువత గంగరాజు, సోమశేఖర్, ఉత్తమ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మదన్‌మహన్‌రెడ్డి, రేపన బాబు, ఆనంద్, తరుగు శివారెడ్డి, జయరాంరెడ్డి, బీఎంఆర్ రెడ్డెప్ప, స్వామిరెడ్డి, మూలపల్లె శేఖర, సురేంద్ర, సుధాకర్, వికలాంగుల అధ్యక్షుడు రామాంజులు, మల్లీ, అశోక్, మధు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



యర్రప్పగారిపల్లిలో గణేశ్ నిమజ్జనంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని ముష్టూరు పంచాయతి యర్రప్పగారిపల్లిలో వెలసిన వినాయక విగ్రహానికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కుమారుడు జునైద్‌అక్బరీ, మండల టీడీపీ నాయకులు వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు రాకుండా పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

కలకడలో: మండలంలోని కె.దొడ్డిపల్లె, బాటవారిపల్లె బీసీ కాలనీతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తిని చాందినీ బండిపై మంగళవాయిద్యాలు, కోలాటాలు, బాణాసంచాల పేలుళ్ల నడుమ ఊరేగింపు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదానం, తీర్థప్రసాదాలను అందజేశారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

వాల్మీకిపురంలో: వాల్మీకిపురంలో ఆదివారం గణేశ్ విగ్రహాల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. స్థానిక పింగాణిఫ్యాక్టరి, ఎన్‌టీఆర్ కాలనీ, చాకలవీధి, తిరుచుట్టువీధి, జెట్టిపాళెం తదితర ప్రాంతాలలోని వినాయక విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు గావించి పురవీధులలో నగరోత్సవం అనంతరం విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

గణేశ్ లడ్డు రూ.లక్షా50వేలు

వాల్మీకిపురం మండలంలోని అయ్యావారిపల్లెలో గణేశ్ లడ్డుకు రికార్డు ధర పలికింది. గ్రామానికి చెందిన గంగసాని నరసింహారెడ్డి రూ.1,50,027 లకు గణేష్ లడ్డు సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు నరసింహారెడ్డిని ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు.



సీఐ రమేష్ పర్యవేక్షణలో గణేశ్ నిమజ్జనం

రామసముద్రంలో: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన గణేశ్ నిమజ్జనం సీఐ రమేష్ పర్యవేక్షణలో జరిగాయి. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా 9వ రోజు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనో త్సవాలు సందడిగా సాగాయి. మండల కేంద్రంలోని ఎగువ దళితవాడ, చింతలవీధిలో ఆదివారం వైభవంగా వినాయకుని నిమజ్జనం జరిగింది. యువత సంతోషంగా రంగులు చల్లుకుని మహా గణపతి ఊరేగింపు చేశారు. అంబేడ్కర్ సర్కిల్ నందు బాణా సంచా పేల్చి బళ్లారి డ్రమ్స్‌లు వాయిస్తూ మహా గణపతి ఊరేగింపు చేశారు. వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి సీఐ రమేష్, ఎస్‌బీహెడ్ కానిస్టేబుల్ రంగస్వామి, పోలీస్ సిబ్బంది తగు చర్యలు చేపట్టారు.

మదనపల్లె అర్బన్‌లో: మండలంలోని కొండామరిపల్లె పంచాయతీ ఇసుకనూతనపల్లె వినాయక నిమజ్జన కార్యక్రమంలో తాలుకా సీఐ కళా వెంకటరమణ పాల్గొన్నారు. అక్కడ నిమజ్జన సమయంలో వినాయకుడికి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో గ్రామాల్లో, వీధుల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి నిర్వహకులు డీజేలు పెట్టరాదని, అతిక్రమించి పెట్టితే వాహనం సీజ్‌చేసి డ్రైవర్‌పై కేసును నమోదు చేస్తామని తాలుకా సీఐ కళా వెంకటరమన తెలిపారు. నిమజ్జనం సమయంలో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై బైండోవర్ కేసులను నమోదు చేసి చట్టపర మైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరాం యాదవ్, వెంకటరమణ, రాటకొండ మధుబాబు, పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు, పాల్గొన్నారు.

ఇంజనీర్లకు మార్గదర్శకుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య



ఇంజనీర్స్ డే సందర్భంగా మాట్లాడుతున్న రిటైర్డ్ సీఈ హరినారాయణరెడ్డి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15: దేశంలోని ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకుడని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ హరినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర మూలాలు ఉన్న విశ్వేశ్వరయ్య కర్ణాటకలో పుట్టి, పెరిగినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మీద మమకారంతో హైదరాబాద్‌లో మూసి నది మునక ప్రాంతాలకు రక్షణగా సివిల్ ఇంజనీరింగ్‌తో నిర్మాణాలు చేపట్టారన్నారు. తిరుమల మొదటి ఘాట్‌రోడ్డుకు డిజైన్ చేసిన విశ్వేశ్వరయ్య ఈ నాటికి, ఆ దారి చెక్కు చెదరకుండా ఉందంటే అది ఆయన ఉపయోగించిన పరిజ్ఞానమే అన్నారు. పంచాయతీరాజ్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్‌గా పేరుప్రఖ్యాతులు పొందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజనీర్లకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం పలువురు ఇంజనీర్లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనయుడు జునైద్ అక్బారి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజగోపాల్, ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్, చంద్రశేఖర్, సఫావుల్లా, డేవిడ్ సంజయ్, రమేశ్ రెడ్డి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



మోక్షగుండం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కురబలకోటలో: ఇంజనీరింగ్ రంగంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని పీఆర్ మాజీ చీఫ్ ఇంజనీర్ అమరనాధరెడ్డి, మాజీ డీఈ సాయి ప్రసాద్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీన్ తులసీరామ్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని అవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 15: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఆదివారం రిటైర్డు ఐజీ ఇ. రాధాకృష్ణ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని ఇండి యా సొసైటీ వారు ఏర్పాటు చేశారు. అనంతరం బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ప్రధాన కార్యదర్శి మునివెంకటప్ప అ ధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డు ఐజీ రాధాకృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ త్యాగ ఫలంతో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు రాజకీయ ప్రముఖులు ప్రయోజనం పొంది ఆర్థికంగా స్థితిమంతులయ్యారన్నారు. కార్యక్రమంలో రిటైర్డు తహసీల్దార్ నరసింహులు, రాజేంద్ర, కేవీ రమణ, రమణ, సుధాకర్, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యమాలా సుదర్శనం, వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్, ఎమ్మార్పీఎస్ నరేంద్రబాబు, పోర్టు లలితమ్మ, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో ఎమ్మెల్యే సతీమణి ప్రత్యేక సమావేశం



రియాజ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, సెప్టెంబరు 15: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి ఆదివారం పీలేరు పట్టణంలోని మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె పట్టణంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు తాగునీటి సమస్య, ఇంటి స్థలాలు, పింఛన్ల గురించి ఆమెకు వినతి పత్రాలు అందించారు. పలు సమస్యలను ఆమె స్థానిక నాయకుల ద్వారా పరిష్కరించి మరికొన్నింటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతకుమునుపు ఆమె పీలేరు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు రియాజ్ సతీమణి ఫర్హానా శ్రీమంతంలో పాల్గొని ఆయన కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటపల్లె బాబు రెడ్డి, పురం రామ్మూర్తి, శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, నరేశ్, యల్లెల రెడ్డప్ప రెడ్డి, లక్ష్మీకర, నారే సతీశ్, పురం రెడ్డమ్మ, సాధన, లక్ష్మీకాంతమ్మ, ఫైరోజ్, ఖాద్రి, సలీం, బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

'సంజీవని' శిబిరానికి విశేష స్పందన



మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, సెప్టెంబరు 15: కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన సంజీవని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సా యంతో తిరుపతికి చెందిన మెడిగో హాస్పిటల్‌కు చెందిన గైనకాలజీ, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులతో ఉచిత వైద్య అవగాహన శిబిరంలో వగళ్ల పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన 215 మంది మహిళలు పాల్గొన్నారు. వారందరికీ వైద్యులు ఉచి త వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అంతే కాకుండా 52 మంది మహిళలకు ఉచితంగా పాప్ స్మియర్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీమ్, శ్రీనివాస ట్రస్టు ట్రస్టీ డాక్టర్ పీవీ బ్రహ్మారెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, వలంటీర్లు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.


ధ్యానం, శాకాహారంతో మానవాళికి ఆరోగ్యం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు15: ధ్యానం, శాకాహారంతో మానవాళి మనుగడకు చక్కని తోడ్పాటునిస్తుందని సదానందగిరి స్వామీజీ అన్నారు. ఆదివారం స్థానిక చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో పిరమిడ్ స్పిరిచువల్ మూమెంట్స్ వరల్డ్ గవర్నింగ్ ట్రస్టు మాజీ ట్రెజరర్ ఏపీ సుబ్బారెడ్డి ఆధ్యక్షతన అవగాహన సభ నిర్వహించారు. పట్టణంలో శాకాహారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా దక్షిణరాష్ట్రాల నుంచి అనేకమంది పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ నాయకులు పాల్గొన్నారు. హిమాలయాల నుంచి వచ్చిన సదానందగిరి స్వామీజీ శాకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ కృష్ణప్ప , చలపతి, తిరుపతి కంచి రఘురాం, హైదరాబాద్ పిరమిడ్ ట్రస్టు ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి రోజును సెలవుగా ప్రకటించాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 15: వాల్మీకి జయంతి అక్టోబరు 17ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోదల నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో వాల్మీకులు అందరూ వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వాల్మీకి జయంతి నాటికి వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల విజయమోహన్, రాష్ట్రీయ వాల్మీకి యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టేకుపల్లె శ్రీనివాసులు కోటా రమణ, చిన్న వెంకటరమణ, నరసింహులు, మండల నాయకుడు చండ్కాయులు, మహిళా అధ్యక్షురాలు గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా షూటింగ్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలురు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 15: జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో షూటింగ్‌బాల్ జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ప్రైవేటు పాఠశాల మైదానంలో నిర్వహించిన ఎంపికలో జూనియర్ విభాగం బాలుర జట్టులో జయంత్, చరణ్‌తేజ్, అరుణ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవికిరణ్, షణ్ముక, సంజయ్‌రెడ్డి, రవికిరణ్, ఓంకార్, భరత్, సదాశివ స్టాండ్‌బైలుగా ప్రసాదరెడ్డి, మోక్షిత్ మౌళి, మౌనిష్‌లను ఎంపిక చేశారు.

బాలికల జట్టులో: రెడ్డి మౌనిక, అనూష, కళ్యాణి మానస, దయాన, బేబి, నిహారిక, నవ్యలత, సాయి జోషిత, లాస్య, యోగితారెడ్డి, స్టాండ్‌బైలుగా గురుప్రియ, సంధ్య, శాలిని ఎంపికయ్యారు. ఎంపికైన రెండు జట్లను షూటింగ్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ నరేష్‌బాబు, కోచ్ యూసఫ్, పీఈటీలు మురళి, గురుమణి అభినందించారు.